క్లుప్తంగా

విద్యార్థులకు శిక్షణ తరగతులు

షాద్‌నగర్: మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో ఉన్న ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కంప్యూటర్స్, యోగా, స్పోకెన్ ఇంగ్లిష్‌లో విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ తరగతులకు మండల పరిధిలోని విఠ్యాల గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా 8, 9 తరగతి చదువుతున్న విద్యార్థులు వైష్ణవి, శ్రావణి, గౌతమ్ శిక్షణా తరగతులకు హాజరవుతున్నారు. దసరా సెలవులను పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వహించే శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 9వ తేదీవరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఆవుల రవి మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసే విధంగా ప్రగతి వెల్ఫేర్ సొసైటీవారు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. శిక్షణా తరగతులు పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

అభినందన



చెన్నయ్యను అభినందిస్తున్న ఎస్సై విజయ్

కొందుర్గు: ప్రభుత్వం రెండురోజుల క్రితం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎల్కగూడ గ్రామానికి చెందిన బోయ చెన్నయ్య జిల్లా మొదటి ర్యాంక్ సాధించడం అభినందనీయమని చౌదరిగూడ ఎస్సై విజయ్ అన్నారు. ఈ సందర్భంగా చెన్నయ్యను శాలువా పూలమాలలతో సన్మానించి అభినందించారు. విద్యార్థులు కృషి పట్టుదల ఉంటే సాధించలేనిది ఉండదన్నారు. ఒక లక్ష్యం పెట్టుకొని చదివితే గమ్యం చేరడం తథ్యమని పేర్కొన్నారు.

రైతు మహాసభను విజయవంతం చేయండి

షాబాద్: ఈ నెల 5న కామారెడ్డిలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా మాజీ అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బొబ్బిలిగామ గ్రామంలో చలో కామారెడ్డి బ్యానర్‌ను విడుదల చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. వరంగల్ సభలో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను అమలు చేయాలని, రైతుభరోసా, వరికి రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. ధరణి సమస్యలు పరిష్కరించి రైతుల ఇబ్బందులను తీర్చాలన్నారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం అడ్డగోలు నిబంధనలు పెట్టి రైతాంగాన్ని మోసం చేసిందని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై కామారెడ్డిలో జరిగే మహాసభలో చర్చ జరుగుతుందన్నారు. జిల్లాలోని రైతులందరూ పెద్ద ఎత్తున తరలివెళ్లి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, సభ్యులు వీరేశం, చంద్రబాబు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలో బతుకమ్మ సంబురాలు



సంబురాల్లో పాల్గొన్న చిన్నారులు, టీచర్, మహిళలు

షాబాద్: మండల పరిధిలోని మక్తగూడ అంగన్‌వాడీలో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి టీచర్ విజయలక్ష్మి రంగు రంగుల పూలతో బతుకమ్మ తయారు చేసి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడిపాడారు. అనంతరం చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రాదాయాలకు ప్రతీక బతుకమ్మ అని తెలిపారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే మన సంస్కృతి సంప్రదాయాలను అలవాటు చేయాలని సూచించారు. మన సంప్రదాయాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. విద్యార్థులు చేసిన ఆటపాటలు అలరించాయి. కార్యక్రమంలో చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



చేవెళ్ల: అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు



చేవెళ్ల: ఆగమన ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, యువకులు

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

మొదటిరోజు బాలత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

చేవెళ్ల: దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి తొమ్మిదిరోజుల పాటు దుర్గామాతను ఒక్కోరోజు ఒక్కో రూపంలో పూజలు చేయనున్నారు. దీనికోసం మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేకంగా దుర్గామాత మండపాలను సిద్ధం చేసి దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారు. మొదటిరోజున అమ్మవారు బాలత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చేవెళ్ల రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలోకి దుర్గామాత విగ్రహాన్ని బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలతో తీసుకొచ్చారు. దుర్గామాత విగ్రహ ఆగమన ఊరేగింపులో ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొన్నారు.

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8 గంటలకు విఘ్నేశపూజ, పుణ్యాహవచనం, 9 గంటలకు హోమం, 10:30 గంటకు సహస్ర నామార్చన, మధ్యాహ్నం 12:30 గంటలకు మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6గంటలకు అష్టోత్తర కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజా క్రార్యమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యం సంఘం,అనుబంధ సంఘాల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు

బంగారు మైసమ్మ దేవాలయంలో..

పట్టణంలోని బంగారు మైసమ్మ దేవాలయంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అందె మోహన్, సౌమ్య దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది నవరాత్రి ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

యువత సేవాగుణం కలిగి ఉండాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: యువత సేవాగుణం కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే ఎల్గనమోని అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో గురువారం గ్రామానికి చెందిన యువకుడు కానం ప్రేమ్‌కుమార్‌గౌడ్ గ్రామంలోని మహిళలకు చీరలను అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గ్రామంలోని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బతుకమ్మ పండుగకు చీరలను అందించిందని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను విస్మరించిందన్నారు. పండుగపూట మహిళల కోసం గ్రామానికి చెందిన యువకుడు ముందుకొచ్చి చీరలను అందించడం సంతోషకరమన్నారు. బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని కోరారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింగ్‌రావు, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మినారాయణగౌడ్, జమాల్‌ఖాన్, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.



మహిళలకు చీరలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

తెల్ల కుసుమ సాగుపై అవగాహన

షాబాద్: తెల్ల కుసుమ సాగు చేసేందుకు రైతులు సమయాత్తం కావాలని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, శాస్త్రవేత్త నందీశ్వర్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బొబ్బిలిగామ, తిర్మలాపూర్, రేగడిదోస్వాడ గ్రామాల్లో భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ రాజేంద్రనగర్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు కుసుమ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కుసుమ సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యం, నేలా ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. భారతీయ నూనె గింజల పరిశోధనా స్థానం అభివృద్ధి చేసిన కుసుమ రకాలు, ఐఎస్ఎఫ్ 764, ఐఎస్ఎఫ్ 300, ఐఎస్ఎఫ్ 123, ఎస్ఈఎల్ 5, ఇటీవల ప్రధాని మోదీ విడుదల చేసిన అధిక దిగుబడి నూనె శాతం కలిగిన కుసుమ రకాల గురించి రైతులకు వివరించారు. అదేవిధంగా రైతు ఉత్పత్తిదారుల సంఘంతో కలిగే ప్రయోజనాలను తెలిపామన్నారు. కార్యక్రమంలో రేగడిదోస్వాడ, తిర్మలాపూర్, సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘం రైతులు యాదవరెడ్డి, చంద్రబాబు, చెన్నయ్య, మాధవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నర్సింలు, విఠల్ తదితరులు ఉన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, శాస్త్రవేత నందీశ్వర్

ప్రమాదకరంగా వంతెన



నందిగామ-నర్సప్పగూడ రోడ్డులో వాగుపై ప్రమాదకరంగా ఉన్న వంతెన

- ఇరువైపులా రక్షణ గోడలు కరువు
- ఆదమరిస్తే కాల్వలోకి వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నందిగామ: నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగించే రహదారి. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న నర్సప్పగూడ రోడ్డులో వాగుపై ఉన్న వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కరువయ్యాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాగు పెద్దఎత్తున ప్రవాహించి అక్కమ్మ చెరువులోకి చేరింది. ప్రస్తుతం అక్కమ్మ చెరువు పూర్తిగా నిండిపోవడంతో బ్యాక్ వాటర్ వాగులో అలాగే నిలిచి ఉంది. వాగుపై ఉన్న వంతెనకు రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏ మాత్రం వాహనం అదుపుతప్పినా ఆ వాహనం వాగు నీటిలో పడిపోవడం ఖాయం. రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చినా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. కొత్త వ్యక్తులు ఎవరైన ఆదమరిచి వాహనాలను నడిపినా వారిపని అంతే సంగతులు అన్నట్టుగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెనపై రక్షణ గోడలు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఊరెళ్తున్నారా.. సమాచారం ఇవ్వండి

మాడ్గుల: దసరా పండుగకు సొంతూర్లకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని సీఐ జగదీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంట్లో డబ్బులు, బంగారం, విలువైన పత్రాలను బ్యాంకు లాకర్లలో భద్రపర్చాలని, లేని యెడలా వెంట తీసుకెళ్లాలని పేర్కొన్నారు. వీధుల్లో ఎవరైనా కొత్తవారు సంచరిస్తే.. వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సీఐ వెల్లడించారు.

‘సీజనల్’పై అప్రమత్తంగా ఉండాలి

నందిగామ: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ స్రవంతి అన్నారు. మండల పరిధిలోని మోత్కులగూడలో గురువారం నందిగామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్రవంతి గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవరమైన వారికి మందులను అందజేశారు. అనంతరం డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ.. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా అనారోగ్య సమస్యలకు గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములమ్మ, గ్రామస్తులు రమేశ్, నర్సింహ, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్రవంతి

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చేవెళ్ల: నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించిన లబ్ధిదారులకు శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తామని తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, మండలంలోని నాయకులు, అధికారులు సకాలంలో పాల్గొనాలని కోరారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

చేవెళ్ల: మండల కేంద్రంలోని బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో దసరా పండుగను పురస్కరించుకొని ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు గురు వారం 3 నుంచి 12వ తేదీవరకు కొనసాగుతాయని ఆలయ అర్చకుడు దేవుని వామనాచార్యులు తెలిపారు. మొదటిరోజు గురువారం ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకం, పుణ్యాహవచనము, అఖండ దీపారాధన, లక్షార్చన, సహస్ర దీపాలంకరణ, కలశస్థాపన, వేదపారాయణము,రాత్రి పల్లకి సేవలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 4వ తేదీ శుక్రవారం అభిషేకం, వేదపారాయణం, చంద్రప్రభ వాహనసేవ, 5వ తేదీన అభిషేకం, వేదపారాయణం, అర్చన, రథోత్సవం, 6వ తేదీన హంస వాహనసేవ, 7వ తేదీన సింహవాహనసేవ, 8న శేష వాహనసేవ, 9న గజ వాహనసేవ, 10న హన్మంత వాహనసేవ, 11న గరుడవాహన సేవ, 12న విజయదశమి వేడుకలు, మధ్యాహ్నం స్వామివారి చక్రతీర్థ(తెప్పోత్సవం)సేవలు, రాత్రికి అశ్వవాహన సేవ, శమీపూజ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకోవాలని కోరారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశామని తెలిపారు.



స్వామివారి పల్లకీసేవలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, అధికారులు

హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బడంగ్‌పేట 23వ డివిజన్‌లో ప్రసిద్ధి చెందిన కాశీబుగ్గ దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం హాల్ నిర్మాణానికి గురువారం మేయర్ చిగురింత పారిజాత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రసిద్ధి చెందిన కాశీబుగ్గ దేవస్థానంలో శివుడు, వేంకటేశ్వరుడి దర్శనానికి విచ్చేస్తున్న భక్తుల కోసం ఈ హాల్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మూడునెలల్లో హాల్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఇట్టి హాల్‌లో చిన్నపాటి జన్మదినాలు, ఫంక్షన్‌లు, పేదలకు అన్నదానాలు ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, మాజీ వైస్ చైర్మన్ నర్సింహరెడ్డి, స్థానిక కార్పొరేటర్ రాళ్లగూడం సంతోషిశ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, సూర్లగంటి అర్జున్, పి.సుదర్శన్‌రెడ్డి, దేవస్థాన టెంపుల్ నిర్వాహకులు మధుమోహనాచార్యులు, జగన్‌మోహనా చార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్, కార్పొరేటర్లు, స్థానికులు

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రావు

హుడాకాంప్లెక్స్: ప్రజలకు అసౌకర్యం కలగకుండా డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం డాక్టర్స్ కాలనీ రోడ్ నెం-4లో సీవరేజ్ బోర్డు, డ్రైనేజీ లైన్ పనులను కాలనీవాసులతో కలిసి ఆయన ప్రారంభించారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, ఆచార్యులు, ఉమాపతి, సత్యనారాయణ, అధికారులు ప్రవీణ్, సూపర్‌వైజర్ శంకర్‌లు పాల్గొన్నారు.

సన్మాన సభను జయప్రదం చేయండి

చేవెళ్ల: నియోజకవర్గంలోని ఐదు మండలాల ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ఆత్మీయ సన్మాన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య కోరారు. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అక్టోబర్ 5వ తేదీ అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ఉపాధ్యాయులందరూ కలిసి విజయవంతం చేయాలని కోరారు. సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, అలాంటి ఉపాధ్యాయులను గుర్తించి వారిని గౌరవించడం మన బాధ్యత అన్నారు. మండలంలోని మల్కాపూర్ బస్‌స్టేజీ సమీపంలోని పద్మావతి కన్వెన్షన్‌లో 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, విద్యాసంస్థల చైర్మన్ ఎ.మురళీ, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి, హన్మంత్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకుడు పోచయ్య, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

భూ బాధిత రైతులను నష్టపోనివ్వం



కేఎల్‌ఆర్‌కు వినతిపత్రం అందిస్తున్న మీర్‌ఖాన్‌పేటవాసులు

కందుకూరు: ఫార్మాలో భూములు కోల్పోయిన రైతులను నష్టపోనివ్వమని మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ భరోసా కల్పించారు. ఫార్మాలో భూములు కోల్పోయిన మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటకు చెందిన రైతులు గురువారం కేఎల్‌ఆర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. టీజీఐఐసీ అధికారులు, స్థానిక నాయకులతో చర్చించి ప్రభుత్వం తీసుకున్న భూములకు పరిహారంతో పాటు గతంలో ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో ఎవరైనా ఇల్లీగల్‌గా స్థలాలు పొందినా వారిని గుర్తించి తొలగించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విధులను బహిష్కరించి నిరసన

ఇబ్రహీంపట్నం: నాంపల్లి కోర్టులో ప్రాక్టిస్ చేస్తున్న న్యాయవాది ఎండీ అబ్దుల్ ఖలీమ్‌పై మాదన్నపేట పోలీస్ అధికారులు దాడి చేయడాన్ని పట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజన్‌కుమార్, కార్యదర్శి మహేందర్‌లు ఖండించారు. ఈ మేరకు గురువారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులకు పాల్పడుతున్న పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే తమకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు మాదన్న, రాములుగౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, ఆకుల రమేష్, ధనంజయ్‌గౌడ్, గణేశ్, బాస్కర్, జగన్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.